క్లుప్తంగా

ఎంపీడీఓకి వినతి

వైరారూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు.. ఎంపీడీఓ సరస్వతి, ఎంపీఓ జ్యోత్స్నదేవికి వినతిపత్రం అందజేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కారోబార్, బిల్‌కలెక్టర్, సహాయ కార్యదర్శులుగా నియమించి, పంచాయతీ సిబ్బందికి రూ.5 లక్షల ప్రమాద భీమా వర్తింప చేయాలని వినతిలో వివరించారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు

కల్లూరు: కల్లూరు పట్టణంలోని ఫ్రెడ్జో బ్యాకరీ తొలి వార్షికోత్సవం సందర్భంగా లక్కి డ్రా నిర్వహించగా విజేతలకు శుక్రవారం రాత్రి ఆర్డీఓ ఎల్ రాజేందర్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవీల చేతుల మీదగా డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి వాషింగ్ మిషన్‌ను కల్లూరుకు చెందిన చిత్రకు అందించగా.. ద్వితీయ బహుమతి కింద మిక్సీని నవ్యకు, తృతీయ బహుమతి ఆపిల్ వాచ్‌ను వంశీకి అందజేశారు. కార్యక్రమంలో బేకరి యాజమాన్యం ఉస్మాన్, హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు చందర్‌రావు, ప్రభాకర్‌రావు, శ్రీకాంత్, సాంబశివరావు, రవి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

సత్తుపల్లిటౌన్: సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రింకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ ఈ నెల 19న మహబూబాబాద్‌లో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పుల్లారావు, రవి, సత్యనారాయణ, ఏసోబు, ప్రతాప్, మారేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


శ్రీనివాస్‌కు నగదు అందిస్తున్న వెంకటేశ్వరరావు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఇసినేపల్లి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వరరావు శుక్రవారం శ్రీనివాసరావును పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, ప్రేమ్‌కుమార్, సురేష్, నరసింహారావు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి..

మధిర: ఆర్థిక ఇబ్బందులతో విద్యాభ్యాసానికి ఇబ్బంది పడుతున్న మహదేవపురం గ్రామానికి చెందిన నందినికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేడె శ్రీనివాస్ తన మిత్రుడికి నందిని ఆర్థిక పరిస్థితి తెలియజేయగా ఆయన స్పందించి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జయరాజు, ఉపాధ్యాయురాలు సునీత పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ దూసరి గోపాలరావు శుక్రవారం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంజూరు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరారూరల్: వైరా సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా లక్ష్మీపురం, గండగలపాడు, స్టేజీపినపాక, కేజీ సిరిపురం, పూసలపాడు, ముసలిమడుగు, కొండకొడిమ, ఖానాపురం గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరామర్శ..

వేంసూరు: బేతుపల్లి కాలువ రూపకర్త తక్కెళ్లపాటి సీతారామయ్య ఇటీవల మృతి చెందగా శుక్రవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గందరగోళంగా రేషన్ సర్వే

- దరఖాస్తు చేసుకున్నా.. పేర్లు గల్లంతు
- మండల వ్యాప్తంగా 1,811 మందితోనే జాబితా విడుదల
- ఆందోళన చెందుతున్న అర్హులు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన


ఎంపీడీఓ సురేందర్‌తో మాట్లాడుతున్న దరఖాస్తుదారులు

కారేపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీన నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయాలనే.. ధృడ సంకల్పంతో లబ్ధిదారుల ఎంపిక కొరకు అధికారులతో ముమ్మరంగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా.. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ రైతు భరోసాతో పాటు రేషన్ కార్డుల సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఇదిలా ఉండగా.. సింగరేణి మండలంలో 41గ్రామ పంచాయతీలకు గాను, 1,811 మంది కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు జాబితా రావటంతో.. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ కార్యదర్శులు లబ్ధిదారుల ఎంపిక కసరత్తులో భాగంగా పరిశీలన సైతం చేపట్టారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 966 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యిందని.. మిగిలిన 845 దరఖాస్తులను 18లోగా పూర్తి చేసి జాబితాను ఆయా పంచాయతీల్లో ప్రదర్శించి గ్రామ సభలు నిర్వహిస్తామని సింగరేణి ఎంపీడీఓ సురేందర్ తెలిపారు.

మా పేర్లు రాలేదని ఆవేదన..

మండల వ్యాప్తంగా సుమారు 150 నుంచి 200ల మంది కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, ఇంటింటి కులగణన సర్వేలో సైతం దరఖాస్తు చేసుకున్నామని, అయినా.. జాబితాలో తమ పేర్లు రాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ఆయా గ్రామ పంచాయతీల్లో కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల ఇంటింటి పరిశీలన కార్యక్రమం జరుగుతుండగా.. దరఖాస్తు చేసుకొన్నా, జాబితాలో పేర్లు రాని లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలకు బారులు తీరుతూ.. సంబంధిత అధికారులను నిలదీస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే క్రమంలో మిస్ అయ్యిపోయాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మళ్లీ దరఖాస్తు చేసుకుంటే.. ఆన్‌లైన్ జాబితా తయారు చేసి, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని, ఖచ్చితంగా అర్హులైతే.. కొత్త రేషన్‌కార్డులు వస్తాయని అధికారులు సర్ది చెప్పి పంపిస్తున్నారు.

జాబితాలో వ్యాపారస్తులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు..

మండల వ్యాప్తంగా కొత్తరేషన్‌కార్డుల సర్వే జాబితాలో బడా వ్యాపారస్తులు, పెన్షన్ పొందుతున్న రైల్వే, సింగరేణి, ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగులు ఉండటం గమనార్హం. కూలీ నాలీ చేసుకొని, పిల్లాజెల్లలతో జీవిస్తున్న తాము కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాలో తమ పేర్లు రాలేదని, వ్యాపారస్తులు, విశ్రాంత ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే సర్వే జాబితాలో వారి పేర్లు వచ్చాయని, అధికారులు నిర్లక్ష్యంగా ఆన్‌లైన్ చేయటంలో పొరపాట్లు చేయటంతో సర్వే జాబితాలో తమ పేర్లు రాలేదని, పనులు మానుకొని ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని.. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందొద్దు..



కొత్తరేషన్‌కార్డు సర్వే జాబితాలో పేర్లు రాని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా మిస్సైతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తుల నివేదికలను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. దీంతో పాటుగా గ్రామసభల్లో అనర్హుల పేర్లు జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు.

– సురేందర్, ఎంపీడీఓ, సింగరేణి

మూడుసార్లు దరఖాస్తు చేశా..



రెండేళ్లుగా.. మూడు సార్లు కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేశాను. ఇటీవల జరిగిన ప్రజాపాలన, ఇంటింటి కులగణన సర్వేలో సైతం దరఖాస్తు చేసుకున్నా.. అయినా సర్వే జాబితాలో నా పేరు రాలేదు. కూలీ పనులు చేస్తేనే ఇల్లు గడిచేది. మాలాంటోళ్ల పేర్లు జాబితాలో రాకపోవటం ఆవేదన కలిగిస్తుంది.

– తొగర శ్రీనివాస్, భారత్‌నగర్‌కాలనీ, కారేపల్లి

పేరు రాలేదు..



ప్రజాపాలన, కులగణన సర్వేల్లో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా.. అయినా నా పేరు కొత్తరేషన్‌కార్డు సర్వే జాబితాలో రాలేదు. అధికారులను అడిగితే ఆన్‌లైన్ ప్రాబ్లమ్ అని చెప్పి వెనక్కి పంపించారు. 'మరో సారి దరఖాస్తు చేసుకో.. పైకి పంపిస్తాం' అంటున్నారు. అధికారులు పట్టించుకోని రేషన్‌కార్డులు ఇప్పించాలి.

– వాడపల్లి ఉపేందర్, బీసీ కాలనీ, కారేపల్లి

ప్రజల సంక్షేమమే ధ్యేయం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని రెబ్బవరం గ్రామంలో శుక్రవారం కిసాన్ ఖేత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ దాసరి దానియేలు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి 30 కుటుంబాలు, టీడీపీ నుంచి 10 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శీలం వెంకటనర్సిరెడ్డి, గుత్తా రామారావు, చట్టి రామకృష్ణ, పమ్మి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక కానరాకుండా పోయింది. ఇటీవల ఆమె ఇంటి వెళ్లిపోగా ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె తల్లి శుక్రవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఇనుప షట్టర్లు అపహరణ

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్‌అండ్‌బీ నూతన వంతెనకు సంబంధించిన ఇనుప షట్టర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనితో రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు పని సూపర్‌వైజర్ కూరాకుల రాంబాబు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నిజాయతీ చాటుకున్న ఇస్త్రీ షాపు నిర్వాహకుడు

తల్లాడ: తల్లాడలో రోడ్డు పక్కన ఇస్త్రీ షాపు నిర్వహిస్తున్న వడ్డానపు రాములు తనకు దొరికిన రూ.లక్ష విలువగల ఐ ఫోన్‌ను శుక్రవారం ఎస్ఐ బి.కొండల్‌రావుకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. దీంతో ఎస్ఐ.. రాములును అభినందించి పారితోషికం అందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బోనకల్: గత ఏడాది అక్టోబర్ 4నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అందులో ఉన్న బోనకల్‌కు చెందిన కె.మధులత, కె.జశ్విత, నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 14,15,16 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన శిక్షణలో ప్రతిభ కనబరిచి తుది జట్టులో స్థానం సంపాదించారు. వీరిద్దరు బోనకల్ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నారు. వీరిని ప్రిన్సిపాల్ పద్మావతి, పీఈటీ సంధ్యారాణి, కోచ్ అమిరేశి లింగయ్య, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు అభినందించారు.

డ్యాన్సర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపి


సంగెపు గోపి

కల్లూరు: డ్యాన్సర్ల అసోసియేషన్ కల్లూరు మండల అధ్యక్షుడిగా కల్లూరు శాంతినగర్‌కు చెందిన సంగెపు గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా డ్యాన్సర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో డ్యాన్సర్ల అసోసియేషన్ కల్లూరు మండల అధ్యక్షుడిగా గోపి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా రమేష్, ప్రచార కార్యదర్శిగా నాగబాబు, కార్యవర్గ సభ్యులుగా చందు, సాయి, అభయ్ రాజేష్‌లను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న సర్వే.. పరిశీలిస్తున్న అధికారులు


వైరా: 16వ వార్డులో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు


బోనకల్: జానకీపురంలో సర్వేతీరును పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత


మధిర: పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత

వైరా: రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగులో లేని భూములు, గుట్టలకు రైతు భరోసా వర్తింప చేయవద్దని తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. రైతు భరోసా పథకం అమలులో భాగంగా వైరా మండలం, మున్సిపాలిటీ పరిధిలోని నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని 1, 16వ వార్డుల్లో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను కమిషనర్ చింతా వేణు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మంజుఖాన్, ఏఈఓలు వాసంతి, రాజేష్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సర్వేయర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఏన్కూరు: మండల వ్యాప్తంగా రైతు భరోసా సర్వేను వ్యవసాయాధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏఓ నరసింహారావు పర్యవేక్షణలో టీఎల్‌పేటలో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఆర్ఐ నవీన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

● మధిర: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు అందిస్తుందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత అన్నారు. శుక్రవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వేని ఆమె పరిశీలించారు. అనంతరం తడి, పొడి చెత్త వేసుకునేందుకు డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భరత్ విద్యా సంస్థల అధినేత వెంకటరెడ్డి, సూరమ్మ, కళావతి, శ్రీనివాస్, విజయ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని జానికీపురం, చిన్నబీరవల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న సర్వేతీరును డీపీఓ ఆశాలత పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో 20 రోజులు పనిదినాలు కలిగి ఉండాలని, సర్వే పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రి, తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి, వందనం గ్రామాల్లో ఉన్నటువంటి లేఅవుట్ చేసిన భూముల్ని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు పరిశీలించగా, నర్సింహాపురం, జగన్నాధపురం, నాగులవంచ గ్రామాల్లో రేషన్‌కార్డుల సర్వేను ఎంపీడీఓ రామయ్య పరిశీలించారు. సర్వేపై తగు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, మండల పంచాయతీ అధికారి పర్వీన్ కైసర్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య పాల్గొన్నారు.

● ముదిగొండ: మండలంలో పలు గ్రామాల్లో వ్యవసాయం చేయకుండా ఖాళీగా ఉన్న వివరాలను వ్యవసాయ సిబ్బంది గుర్తించగా.. వెంకటాపురం, ముదిగొండ గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వేను ఎంపీడీఓ శ్రీదర్‌స్వామి పరిశీలించారు.

● ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, రాజుపాలెం, ఎర్రుపాలెం, బనిగండ్లపాడు తదితర అన్ని గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు రైతు భరోసా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ సాయి శివ, ఆర్ఐలు రవి, రాజశేఖర్, ఏఈఓలు వంశీకృష్ణ, బాలకృష్ణ, ప్రసన్న, సింధూర్, గోపి, శ్రీకాంత్, కృష్ణకుమారి, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● తల్లాడ: మండలంలో ఇరవైఏడు పంచాయతీల్లో అధికారులు శుక్రవారం నాలుగు ప్రభుత్వ పథకాలపై సర్వే చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అయ్యిందని ఎంపీడీఓ చంద్రమౌళి పేర్కొన్నారు.

● కల్లూరురూరల్: మండలంలో చేపడుతున్న నాలుగు ప్రభుత్వ పథకాల సర్వేను తహసీల్దార్ సాంబశివుడు, డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, సుజాత పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ పలు సూచనలు చేశారు. వెన్నవెల్లి గ్రామంలో తహసీల్దార్ సర్వేను పరిశీలించారు.

● వేంసూరు: మండల పరిధిలోని మొద్దుల గూడెం, అడసర్లపాడులో సర్వేను ఆర్డీఓ రాజేంద్రగౌడ్ పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


సత్తుపల్లిరూరల్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్/కొణిజర్ల: భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేఎస్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యస్.రవిచందర్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సత్తుపల్లిలో ఎంవీఐ విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కొణిజర్లలో ఏఎంవీఐ ఆటో డ్రైవర్లు, ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. అతి వేగం ప్రమాదకరమన్నారు. ఆటోల్లో అనుమతికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దన్నారు. ద్విచక్రవాహనాలు హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. నడిపేటప్పుడు పిల్లలు, కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని నడపాలన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్ కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. రోడ్డు ప్రయాణం ప్రతి మనిషికి తప్పనిసరి అని.. కానీ అంతకన్నా విలువైనది ప్రాణం కనుక రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులకు చేసిందేమి లేదు'


కొణిజర్ల: మాట్లాడుతున్న రమేష్

కొణిజర్ల: ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేసిందేమి లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోడియాతండాలో బి.రాందాస్ అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు శక్తి వంతమైన ఉద్యమాలకు రైతులు సిద్ధం కావాలన్నారు. తనికెళ్ల రెవెన్యూ పరిధిలో ఉన్న బోడియా తండాకు ఈదుల చెరువు కేటాయించి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులతో పాటు పొలాలకు వెళ్లే రహదారులను బాగు చేయించాలన్నారు. అనంతరం ధరావత్ రవి అధ్యక్షుడిగా వడిత్యా వీరన్న ప్రధాన కార్యదర్శిగా 9 మంది కార్యవర్గంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వడిత్యా వీరన్న, ధరావత్ రవి, బానోత్ వెంకన్న, బీమ్లా, హనుమా రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షోభాన్ని పరిష్కరించాలి..

కల్లూరు: వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, మాచర్ల భారతిలు పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరులోని సీపీఎం కార్యాలయంలో తన్నీరు కృష్ణార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు సమస్యలపై నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్గత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలకు ముప్పు కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతులు

సాక్షి ఎఫెక్ట్..

ఎర్రుపాలెం: మండలంలో గత సంవత్సర కాలంగా ఇసుక రవాణాకు అనుమతి లేకుండా ఉంది. సమస్య తీవ్రతను గత నెల 29వ తేదిన సాక్షి దినపత్రికలో 'ఇసుక.. కష్టమే' అనే శీర్షికన వార్త ప్రచురించింది. సమస్య తీవ్రతపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా, అనుమతులకు సంబంధించిన ఆదేశాలు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. నియోజవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇసుక రేవుల ఏర్పాటుకు ఆదేశాలు చేశారు. ఎర్రుపాలెం మండలంలోని తక్కెళ్లపాడు, సఖినవీడు, రాజులదేవరపాడు, మీనవోలు గ్రామాల్లోని కట్లేరు రేవుల నుంచి ఇసుక రేవులకు అనుమతులు వచ్చాయి. ఒక్కొక్క క్యూబిక్ మీటర్‌కు గానూ రూ.1,500 డీడీని తహసీల్దార్ పేరిట చెల్లించి రేవుల నుంచి ఇసుక పొందవచ్చని ఆర్డీఓ ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

వైరారూరల్: ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెరుగు సత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, సుధాకర్, నాగేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ధర్నా..

బోనకల్: ఈ నెల 18న తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనేకమంది అర్హుల పేర్లు ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో రాలేదన్నారు.

నిబంధనలు పాటించనందునే బోర్డు తొలగింపు


సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

మధిర: మండలంలోని ప్రభుత్వ ఆస్తి అయిన ఆత్కూరు సర్కిల్‌కి అబ్బూరి పేరు ఉండడం నిబంధనలకు విరుద్ధం కావడంతోనే అధికారులు తొలగించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారా బాలరాజుతో కలిసి మాట్లాడారు. రూ.14 కోట్ల వ్యయంతో మధిర నుంచి ఆత్కూరు రింగ్ వరకు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు భట్టి విక్రమార్క అభివృద్ధి చేస్తే ప్రభుత్వ ఆస్తికి ప్రైవేట్ వ్యక్తి పేరు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సర్కిల్‌లో భట్టి పాదయాత్ర సమయాన వాల్‌రైటింగ్ ఉంటే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గంటల్లో తొలగించిందని, షర్మిల పాదయాత్ర సమయంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే తొలగించారని గుర్తుచేశారు. కాగా, బీజేపీ రాష్ట్ర నాయకుడని చెప్పుకునే కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఎవరు పిలిస్తే ఆత్కూరులో ధర్నాకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చావా వేణు, పాటిబండ్ల సత్యంబాబు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, కర్నాటి రామారావు, నిడమానూరి వంశీ, బొమ్మకంటి హరిబాబు, ఆదూరి శ్రీనివాస్, షేక్ జహంగీర్, మీనుగు చైతన్య తదితరులు పాల్గొన్నారు.